దసరా ధమాకా!

హైదరాబాద్‌లో దసరా ధమాకాకు రంగం సిద్ధమైంది. ఉప్పల్ స్టేడియంలో నేడు భారత్, బంగ్లాదేశ్ మధ్య మూడో టీ20 పోరుకు సమయం ఆసన్నమైంది. ఇప్పటికే సిరీస్ కైవసం చేసుకున్న టీమ్‌ఇండియా క్లీన్‌స్వీప్‌పై కన్నేస్తే..కనీసం ఆఖరి మ్యాచ్‌లో నైనా గెలిచి పరువు కాపాడుకోవాలని బంగ్లా ఆరాటపడుతున్నది. పొట్టిపోరులో అవకాశాలను అందిపుచ్చుకుంటూ కుర్రాళ్లు కేక పుట్టిస్తున్న వేళ రిజర్వ్ బెంచ్‌ను రంగంలోకి దింపేందుకు టీమ్ మేనేజ్‌మెంట్ పావులు కదుపుతున్నది. ఢిల్లీ టీ20లో దుమ్మురేపిన నితీశ్‌రెడ్డి సొంతగడ్డపై సత్తాచాటాలన్న కసితో ఉన్నాడు. టీమ్‌ఇండియాకు కనీస పోటీనిచ్చేందుకు బంగ్లా పట్టుదలతో ఉన్నది. శనివారం జరిగే మ్యాచ్‌కు వరుణుడు అంతరాయం కల్గించనుందన్న వార్త అభిమానులను ఆందోళనకు గురిచేస్తున్నది.

నేడు ఉప్పల్‌లో భారత్, బంగ్లా మూడో టీ20

సిరీస్ క్లీన్‌స్వీప్‌పై కన్నేసిన టీమ్‌ఇండియా .. మ్యాచ్‌కు వర్షం ముప్పు

రాత్రి 7 నుంచి స్పోర్ట్స్-18లో

హైదరాబాద్, ఆట ప్రతినిధి: భారత్, బంగ్లాదేశ్ మధ్య మూడో టీ20 పోరుకు ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియం అన్ని హంగులతో సిద్ధమైంది. దసరా పర్వదినమైన శనివారం ఇరు జట్ల మధ్య ఆసక్తికపోరు జరుగనుంది. గ్వాలియర్, ఢిల్లీ విజయాలతో మంచి ఊపుమీదున్న టీమ్‌ఇండియా..హైదరాబాద్‌లోనూ అదే ప్రదర్శన పునరావృతం చేయాలని చూస్తున్నది. పరుగుల వరద పారే ఉప్పల్ పిచ్‌పై ఎవరిది ఆధిపత్యమో మరికొన్ని గంటల్లో తేలనుంది. అయితే వాతావరణ శాఖ అంచనాల ప్రకారం శనివారం మ్యాచ్‌కు వర్షం అంతరాయం కల్గించే అవకాశాలు ఉన్నాయి.

క్లీన్‌స్వీప్ లక్ష్యంగా: సొంతగడ్డపై తమకు తిరుగులేదని నిరూపించుకునేందుకు భారత్ మరోమారు సిద్ధమైంది. ప్రత్యర్థి ఎవరైనా సిరీస్ మన ఖాతాలో చేరాలన్న ఏకైక లక్ష్యంతో ముందుకెళుతున్నది. ఇప్పటికే సిరీస్ దక్కించుకున్న టీమ్‌ఇండియా..మూడో పోరుకు మార్పులు, చేర్పులు చేసే చాన్స్ ఉంది. ఫామ్‌లేమితో ఇబ్బంది పడుడుతున్న శాంసన్ స్థానంలో జితేశ్‌శర్మను, వరుణ్ చక్రవర్తికి బదులు రవి బిష్ణోయ్‌ను, మయాంక్ స్థానంలో హర్షిత్‌రానాను తుది జట్టులోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. ఢిల్లీ టీ20లో అదరగొట్టిన తెలుగు ఆల్‌రౌండర్ నితీశ్..సొంత ఇలాఖాలో సత్తా చాటాలన్న పట్టుదలతో ఉన్నాడు.

పరువు కోసం: సిరీస్‌లో భారత్‌కు కనీసం పోటీనివ్వలేకపోతున్న బంగ్లా కనీసం పరువైనా దక్కించుకోవాలని చూస్తున్నది. టెస్టు సిరీస్‌తో పాటు టీ20ల్లో వరుస ఓటములతో ఆత్మవిశ్వాసం సన్నగిల్లిన బంగ్లా..చివరి పోరులో రాణించేందుకు సర్వశక్తులు ఒడ్డనుంది. బంగ్లా తరపున మహ్మదుల్లా తన ఆఖరి టీ20 మ్యాచ్ ఆడబోతున్నాడు.

న్యూఢిల్లీలో జరిగిన లాక్మే ఫ్యాషన్ వీక్‌లో తళుక్కుమన్న స్టార్ షూటర్ మను భాకర్. ఇటీవల జరిగిన పారిస్ ఒలింపిక్స్‌లో మను రెండు కాంస్య పతకాలతో కొత్త చరిత్ర లిఖించింది.

మనన్ అజేయ సెంచరీ

- గుజరాత్ తొలి ఇన్నింగ్స్ 334/8, హైదరాబాద్‌తో రంజీ పోరు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: స్థానిక జింఖాన మైదానం వేదికగా హైదరాబాద్, గుజరాత్ మధ్య గ్రూపు-బీ రంజీ పోరు ఆసక్తికరంగా సాగుతున్నది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న గుజరాత్ తొలిరోజు ఆట ముగిసే సరికి 8 వికెట్లు కోల్పోయి 334 పరుగులు చేసింది. హైదరాబాద్ బౌలర్ల ధాటికి 98 పరుగులకే 5 కీలక వికెట్లు కోల్పోయిన గుజరాత్‌ను మనన్ హింగ్రిజా (174 నాటౌట్), ఉర్విల్ పటేల్ (60) ఒడ్డున పడేశారు. త్యాగరాజన్(2/62) బౌలింగ్‌లో ఉర్విల్ ఔట్‌తో ఆరో వికెట్‌కు 112 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. మనన్‌తో పాటు రింకేశ్ (24) క్రీజులో ఉన్నారు. సీవీ మిలింద్ (3/51), నిశాంత్ (2/46) రాణించారు.

సెమీస్‌లో రష్మిక

మైసూర్: ఐటీఎఫ్ మైసూర్ ఓపెన్‌లో రాష్ట్ర యువ టెన్నిస్ ప్లేయర్ శ్రీవల్లి రష్మిక సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో రష్మిక 6-2, 6-3తో ఆకాంక్ష నిట్టూరుపై అద్భుత విజయం సాధించింది. ఆది నుంచే తనదైన జోరు కనబరిచిన రష్మిక..ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. మిగతా మ్యాచ్‌ల్లో రియా భాటియా 0-6, 6-3, 7-5తో స్మృతి బాసిన్‌పై, జెస్సీ అనె 6-4, 6-0తో పూన ఇంగ్లేపై, లక్ష్మిప్రభ 6-4, 2-1తో ఎలెనాపై గెలిచి ముందంజ వేశారు.

డీఎస్పీ సిరాజ్

బాధ్యతలు స్వీకరించిన భారత పేసర్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: భారత స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్..డిప్యూటీ సూపరింటెండెంట్(డీఎస్పీ)గా బాధ్యతలు స్వీకరించాడు. శుక్రవారం హైదరాబాద్‌లో డీజీపీ జితేందర్‌ను కలుసుకుని అధికారికంగా ఉత్తర్వులు అందుకున్నాడు. అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ ఖ్యాతిని ఇనుమడింపజేసేలా రాణిస్తున్న సిరాజ్ ప్రదర్శనకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం జూబ్లిహిల్స్‌లో 600 గజాల స్థలానికి తోడు గ్రూపు-1 పోస్టింగ్ కింద డీఎస్పీగా నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా సిరాజ్.. డీఎస్పీగా అధికారికంగా విధుల్లో చేరాడు. పదునైన పేస్‌తో ప్రత్యర్థి బ్యాటర్లకు పరీక్ష పెట్టే ఈ హైదరాబాదీ స్పీడ్ స్టర్ అనతికాలంలోనే టీమ్‌ఇండియాలో కీలక బౌలర్‌గా ఎదిగిన సంగతి తెలిసిందే.

ప్రొ కబడ్డీ జూనియర్ లీగ్‌కు చైతన్య విద్యార్థులు

హైదరాబాద్, అక్టోబర్11(నమస్తే తెలంగాణ): ప్రొ కబడ్డీ జూనియర్ లీగ్ సీజన్-5కు శ్రీచైతన్య విద్యార్థులు ఎంపిక య్యారు. శుక్రవారం జూబ్లిహిల్స్ ఓబుల్‌రెడ్డి స్కూల్‌లో నిర్వహించిన క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో శామీర్‌పేటకు చెందిన చైతన్య విద్యార్థులు ప్రతిభ చాటారు. మొత్తం 40 టీమ్‌లు హోరాహోరీగా తలపడగా, మొత్తం 16 జట్లను ఎంపిక చేశారు. స్కూల్‌కు చెందిన కబడ్డీ ప్లేయర్లను ప్రిన్సిపల్ ముత్తయ్య, కోచ్ సాయికుమార్ ప్రత్యేకంగా అభినందించారు

ఇంగ్లండ్ చారిత్రక విజయం

ఇన్నింగ్స్ తేడాతో ఓటమిపాలైన పాక్ • మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ముందంజ

ముల్తాన్: ఇంగ్లండ్ చారిత్రక విజయంతో కదంతొక్కింది. పాకిస్థాన్‌తో తొలి టెస్టులో ఇన్నింగ్స్ 47 పరుగుల తేడాతో ఇంగ్లండ్ అద్భుత విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ముందంజ వేసింది. పరుగుల వరద పారిన ముల్తాన్ పిచ్‌పై ఇంగ్లిష్ జట్టు అన్నింటా ఆధిపత్యం ప్రదర్శించింది. ఓవర్‌నైట్ స్కోరు 152/6తో ఆఖరి రోజు రెండో ఇన్నింగ్స్‌కు దిగిన పాక్..220 పరుగులకు పరిమితమైంది. ఓవర్‌నైట్ బ్యాటర్లు సల్మాన్‌అలీ ఆగా(63), ఆమెర్ జమాల్(55 నాటౌట్) అర్ధసెంచరీలతో పోరాడే ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. వీరిద్దరు ఇంగ్లండ్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ విజయాన్ని ఆలస్యం చేసే ప్రయత్నం చేశారు. ఏడో వికెట్‌కు సల్మాన్, జమాల్ కలిసి 109 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అయితే స్పిన్నర్ జాక్ లీచ్(4/30) విజృంభణతో పాక్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి తొలి సెషన్‌లో మ్యాచ్‌ను ఇంగ్లండ్‌కు అప్పగించేసింది. లీచ్‌కు తోడు అట్కిన్సన్(2/46), జాక్ లీచ్(2/30) రాణించడంతో ఇంగ్లండ్ గెలుపు సులువైంది.

నాకు వ్యక్తిగత కోచ్ కావాలి

న్యూఢిల్లీ: అంతర్జాతీయ స్థాయిలో మరింత మెరుగ్గా రాణించేందుకు తనకు వ్యక్తిగత కోచ్ కావాలని భారత స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ పేర్కొంది. ఇటీవల ముగిసిన పారిస్ ఒలింపిక్స్‌లో భారీ అంచనాల మధ్య బరిలోకి దిగిన నిఖత్..లీగ్ దశలోనే వైదొలిగింది. చైనా బాక్సర్ వు యు చేతిలో ఓటమితో మెగాటోర్నీ ఉంచి అనూహ్యంగా నిష్క్రమించింది. అయితే తన లోపాలపై దృష్టి పెట్టిన నిఖత్ తిరిగి పుంజుకునేందుకు ప్రయత్నిస్తున్నది. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ 'ఎవరూ కూడా అంత పర్‌ఫెక్ట్ కాదు. ఆ రోజు నాది కాదు. అన్‌సీడెడ్‌గా పోటీకి దిగిన నాకు తొలి రౌండ్లలోనే అత్యుత్తమ బాక్సర్ ఎదురైంది. ఇదంతా ఒక ఎత్తు అయితే గతంలో నా చేతిలో ఓడిన వాళ్లు పతకాలు గెలువడం చాలా బాధ కల్గించింది. నిజాన్ని అంగీకరించి ముందుకు సాగాల్సిందే. నాకు ఒక వ్యక్తిగత కోచ్ కావాలి. అందుకోసం వెతుకుతున్నాను. నన్ను మరింత మెరుగ్గా మలిచే కోచ్ కోసం చూస్తున్నాను. విదేశాల్లో కోచింగ్ తీసుకునేందుకు ఆసక్తిగా ఉన్నాను' అని అంది.

- పిట్ట కొంచెం.. తెలివి ఘనం

మన స్టైల్‌లో ఇల్లు కట్టుకోవాలంటే ఒక ఇంజినీర్ కావాలి. కానీ అవన్నీ అవసరం లేదు నా స్టైల్‌లో నేను గూడు కట్టుకుంటా అంటున్నది ఈ తెలివిగల ఇంజినీర్ పిట్ట.. ఇలానే ఎర్రవెల్లిలోని ఓ వ్యవసాయక్షేత్రంలో ఓ పిట్ట కట్టుకున్న గూడు మాజీ ఎంపీ సంతోష్ కుమార్ కంట పడింది. ఆయన వెంటనే తన కెమెరాలో ఈ చిత్రాన్ని బంధించారు.

పండుగను సుఖ సంతోషాలతో జరుపుకోవాలి

దసరా శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్

హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాష్ట్ర ప్రజలకు దసరా పండగ శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం రాజ్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. దసరా పండుగను ప్రజలందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని సూచించారు. విజయదశమి సమస్త విజయాలకు సంకేతమని, చేపట్టిన కార్యాలు నిర్విఘ్నంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

మహిషాసురమర్దినిగా భద్రకాళి

వరంగల్ నగరంలోని భద్రకాళీ ఆలయంలో శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.
- వరంగల్

రానున్న మూడు రోజులు వర్షాలు

హైదరాబాద్, అక్టోబర్ 11 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణకేంద్రం తెలిపింది. మరో మూడు రోజులపాటు వర్షాలు కొనసాగుతాయని తెలిపింది.

క్రీడాకారులపై సర్కారు చిన్నచూపు

- ఏషియన్ యూనివర్సిటీ పోటీలకు సోషల్ వెల్ఫేర్ విద్యార్థుల ఎంపిక
- ఆర్థిక ఇబ్బందులతో సతమతం..
- సాయం కోసం వేడుకున్నా పట్టని ప్రభుత్వం
- మరోవైపు స్పోర్ట్స్ వర్సిటీ అంటూ ప్రగల్భాలు

ఇందు, రాణి

మమత

హైదరాబాద్, అక్టోబర్11 (నమస్తే తెలంగాణ) : స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం.. ఒలింపిక్స్‌లో మెడల్స్ సాధించడమే లక్ష్యంగా చర్యలు చేపడతాం.. క్రీడాకారులను ప్రోత్సహిస్తాం.. అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన మాటలన్నీ ఉత్త ప్రగల్భాలేనని తేలిపోయింది. క్రీడాకారులను తయారు చేయడమేమోగానీ, కనీసం ప్రతిభ గల క్రీడాకారులకు సాయం అందించని దుస్థితి నెలకొన్నది. భువనగిరి ఆర్మ్‌డ్‌ఫోర్స్ గురుకుల డిగ్రీ కాలేజీకి చెందిన మమత, ఆర్మూర్ గురుకుల డిగ్రీ కాలేజీకి చెందిన రాణి, ఇందు.. నిజామాబాద్ జిల్లా సుద్దపల్లిలోని స్పోర్ట్స్ అకాడమీలో సాఫ్ట్‌బాల్‌లో శిక్షణ పొందారు. మహారాష్ట్ర జల్‌గావ్ జిల్లాలో గత నెలలో నిర్వహించిన శిబిరంలో పాల్గొని ప్రతిభ చాటారు. దీంతో తైవాన్‌లో ఈ నెల 15-19వరకు నిర్వహించనున్న 4వ ఏషియన్ యూనివర్సిటీ ఉమెన్ సాఫ్ట్‌బాల్ ఆసియా కప్ తైచుంగ్-2024 పోటీలకు వీరు ఎంపిక య్యారు. నేడు చెన్నై వెళ్లి అక్కడి నుంచి తైవాన్‌కు వెళ్లాల్సింది. వీరు అక్కడికి వెళ్లాలంటే ఒక్కొక్కరికి దాదాపు రూ.1.50 లక్షలు ఖర్చయ్యే అవకాశమున్నది. ఆ మొత్తాన్ని ముందుగానే సాఫ్ట్‌బాల్ అసిసోయేషన్ ఆఫ్ ఇండియా అకౌంట్‌లో జమచేయాల్సి ఉంది. కానీ, వీరంతా నిరుపేద కుటుంబాలకు చెందినవారు కావడంతో తమ పాఠశాలల ప్రిన్సిపాళ్ల ద్వారా సొసైటీ సెక్రటరీకి లెటర్ పెట్టుకున్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక సహకారం అందించాలని కోరారు. సోషల్ వెల్ఫేర్ సొసైటీ సెక్రటరీ నుంచి ఎలాంటి సమాధానం లేకుండాపోయింది. దీంతో వారు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. ఆర్థికసాయం అందించాలని అభ్యర్థించారు. దీంతో ఆయన సొసైటీ సెక్రటరీకి లేఖ రాశారు. అయినప్పటికీ క్రీడాకారులకు సొసైటీ రూపాయి కూడా విడుదల చేయలేదు. ప్రభుత్వం తరపున కూడాఎలాంటి సాయం అందని దుస్థితి. అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనా క్రీడాకారులకు ప్రోత్సాహం కరువైందని క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఇదేనా ప్రభుత్వ క్రీడాపాలసీ అంటూ సొసైటీవర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలోనూ గురుకుల సొసైటీకి చెందిన హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు తిరుపతి జోర్డాన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ పోటీలకు ఎంపిక య్యాడు. అప్పుడు కూడా సొసైటీ ఏవిధమైన ఆర్థికసాయం అందించలేదు. దీంతో సదరు క్రీడాకారుడి పరిస్థితిని వివరిస్తూ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ట్వీట్ చేయగా.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముందుకొచ్చి ప్రయాణ తదితర ఖర్చులను భరించినట్టు ఉదహరిస్తున్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.